## జర్మనీ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ, జర్మనీ వర్సిటీ ఒప్పందంతో నిర్వహిస్తున్న రెండు వేర్వేరు మాస్టర్(పీజీ) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జర్మనీ రెయుట్లింగెన్ వర్సిటీతో కలిసి నిర్వహించే ఇంటర్నేషనల్ మాస్టర్స్ ఇన్ ప్రొఫెషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లో 30 సీట్లు, కాసల్ వర్సిటీలో డబుల్ డిగ్రీ మాస్టర్ ఆఫ్ సైన్స్(డీడీఎంఎస్‌పీ) ప్రోగ్రామ్ రెనవబుల్ ఎనర్జీ కోర్సులో 25సీట్లు ఉన్నాయన్నారు. గురువారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 20తో గడువు ముగుస్తుందని వివరించారు. ఆలస్య రుసుము రూ.1000తో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23 వరకు అవకాశం ఉందన్నారు. ప్రవేశాలకు ఈ నెల 27న ఉదయం 10గంటలకు జేఎన్‌టీయూలో కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

## యూసీఈఎస్‌టీహెచ్‌లో జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కేపీహెచ్ బీ

జేఎన్‌టీయూహెచ్ వైస్-ఛాన్సలర్ డా. టి. కిషన్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ డా. ఎ. దామోదరం బుధవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, హైదరాబాద్ (యూసీఈఎస్‌టీహెచ్)లోని వివిధ విభాగాల కార్యాలయాలు, ప్రయోగశాలలు, పరీక్షల విభాగం, ఇతర మౌలిక సదుపాయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షల విభాగాన్ని సందర్శించి, వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. అన్ని విభాగాల్లో పరిశుభ్రతను పరిశీలించిన రెక్టర్, క్యాంపస్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఇంజినీరింగ్ సెల్ అధికారులను ఆదేశించారు. అలాగే క్యాంపస్‌లో ఉత్పత్తి అయ్యే రసాయన వ్యర్థాలు, ఈ-వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో వేరు చేసి, త్వరితగతిన పారవేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి డిస్పెన్సర్ల పనితీరును కూడా ఆయన పరిశీలించారు. అనంతరం రసాయన శాస్త్రం, రసాయన ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాల ప్రయోగశాలలను తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న పరికరాలు, సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా వివిధ విభాగాల విద్యార్థులతో ముచ్చటించిన డా. దామోదరం, తరగతుల నిర్వహణ, ప్రయోగశాలల నాణ్యత, విద్యా సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే యూనివర్సిటీ హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులతో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీల్లో యూసీఈఎస్‌టీహెచ్ ప్రిన్సిపాల్ డా. జి. వి. నరసింహ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ. రఘురామ్, డా. ఎన్. దర్గా కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కళాశాలలో రెక్టార్ తనిఖీలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ కళాశాలలోని పలు విభాగాలు, ప్రయోగశాలలను బుధవారం రెక్టార్ డాక్టర్ ఎ.దామోదరం తనిఖీ చేశారు. రసాయనశాస్త్రం, మెకానికల్, సివిల్, ఈఈఈ తదితర విభాగాల్లోని ప్రయోగశాలల్లో సదుపాయాలు, విద్యార్థులు ప్రయోగాలు చేసుకోవడానికి ఉన్న అవకాశాలను ఆయన పరిశీలించారు. పరీక్షల విభాగాన్ని తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కళాశాల ప్రతి విభాగంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వ్యర్థాల తరలింపు ఎప్పటికప్పుడు జరగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న రెక్టార్ దామోదరం. చిత్రంలో ప్రిన్సిపల్ నరసింహారెడ్డి

## జేఎన్‌టీయూహెచ్‌లో రెక్టార్ ఆకస్మిక తనిఖీలు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో వివిధ విభాగాలను రెక్టార్ దామోదరం బుధవారం తనిఖీ చేశారు. వీసీ డా. టి.కిషన్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు యూసీఈఎస్‌టీహెచ్‌లోని వివిధ విభాగాలు, కార్యాలయాలు, ప్రయోగశాల సౌకర్యాలను రెక్టార్ దామోదరం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో పరిశుభ్రతను సమీక్షించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఇంజనీరింగ్ సెల్ అధికారులను ఆదేశించారు. క్యాంపస్‌లోని రసాయన, ఈ వ్యర్థాలను సరైన పద్ధతిలో వేరు చేసి, త్వరితగతిన తొలగించాలన్నారు. తాగునీటి డిస్పెన్సర్‌లను కూడా పరిశీలించారు. రసాయన శాస్త్రం, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాల ప్రయోగశాలల్లో వసతులను పరిశీలించారు. వివిధ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జి.వి. నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. రఘురామ్, డా. ఎన్ దుర్గాకుమార్ పాల్గొన్నారు.



## రేపు ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ తొలి విడత సీట్లను ఈ నెల 10వ తేదీన కేటాయిస్తారు. అధికారులు ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 4వ తేదీన సీట్ల కేటాయింపు మాక్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత విద్యార్థులు భారీగా ఆప్షన్లు మార్చుకున్నారు. ఈ అవకాశం మంగళవారం రాత్రితో ముగిసింది. కౌన్సెలింగ్‌కు రాష్ట్రవ్యాప్తంగా 89, 785 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 88, 053 మంది ఆప్షన్లు ఇచ్చారు. ఒక్కొక్కరు కాలేజీలు, బ్రాంచ్‌ల వారీగా లెక్కకు మించిన సంఖ్యలో ఆప్షన్లు ఇచ్చారు. మొత్తంగా 55, 14, 891 ఆప్షన్లు అందాయి. 175 కాలేజీల్లో 88, 053 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా 79, 313 సీట్లను మాక్ కౌన్సెలింగ్ ద్వారా కేటాయించారు. విద్యార్థులు ఈసారి కూడా కంప్యూటర్ సైన్స్ కోర్సులకే ప్రాధాన్యమిచ్చారు. తొలి దశ సీట్ల కేటాయింపు తర్వాత వారం రోజుల్లో రెండో దశ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు.

## ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

చిక్కడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ రాయిట్లింగేన్ యూనివర్సిటీ నాలెడ్జ్ ఫౌండేషన్, జర్మనీ సంయుక్తంగా 2026 విద్యాసంవత్సరానికి ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు మొదటి మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూహెచ్‌లో అనంతరం రెండు సంవత్సరాలు జర్మనీలోని రాయిట్లింగేన్ యూనివర్సిటీలో చదువుతారు. జేఈఈ మెయిన్ స్కోర్ లేదా తెలంగాణ ఎప్‌సెట్ ర్యాంకు ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, 15వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందని ఇతర వివరాలకు 9044115999, 9044117999 నెంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.